పంచ్ డైలాగ్‌లకు ఓట్లు పడవు

- సంక్షేమ పాలనకే ప్రజల మద్దతు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- గొల్లల ఎండాడలో రూ.1.34 కోట్లతో నిర్మించిన థీమ్ పార్కు ప్రారంభం



థీమ్ పార్క్ ప్రారంభించి వ్యాయామం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది : రాజకీయం అంటే పంచ్ డైలాగ్‌లు చెప్పడం కాదని, అలాంటి డైలాగ్‌లకు ఓట్లు పడవని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో రూ.1.34 కోట్ల వ్యయంతో నిర్మించిన థీమ్ పార్కును ఆయన మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు పంచ్ డైలాగ్స్‌తో రాజకీయాలు నడిపిద్దామనుకుంటున్నారని, ప్రజల మన్ననలు పొందడం డైలాగ్ చెప్పినంత సులువు కాదన్నారు. సంక్షేమ పాలనకే ప్రజలు మద్దతు తెలుపుతారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రతిపక్షల నాయకులు రాష్ట్రంలో అభివృద్ధి జరగ లేదంటున్నారని, మరి అభివృద్ధి జరగకుంటే ఈ ఐదు సంవత్సరాలు ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలోనూ మౌలిక సౌకర్యాల కల్పనతోపాటు అనేక చోట్ల పార్కులు అభివృద్ధి చేశామన్నారు. వంద రోజుల్లోనే థీమ్ పార్కు నిర్మించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో లంచాలు లేకుండా, మతం, కులం చూడకుండా సంక్షేమ ఫలాలు అందరికీ అందుతున్నాయని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి 175 స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా గెలిపించాలని కోరారు. సీఎం జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సహకరించాలని కోరారు. అనంతరం థీమ్ పార్క్‌లో నాయకులతో కలిసి కాసేపు వ్యాయామం చేశారు. బీసీ కాలనీలో రూ.65 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవనం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, ఏఈ శ్రీధర్, వివిధ విభాగాల అధ్యక్షులు ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, నొడగల రాంబాబు, మాదు చంటి, బుజ్జి, దువ్వి వాసు, చెన్నాదాస్, చెన్నా ఎల్లయ్య, అప్పలస్వామి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మాణంలో కక్కుర్తి

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేట డంపింగ్ యార్డులో సుమారు రూ.40 లక్షలతో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్) నిర్మాణంలో కక్కుర్తి పనులను జీవీఎంసీ సిబ్బందే వేలెత్తి చూపుతున్నారు. ఈ స్టేషన్ ముందు పల్లపు ప్రాంతాన్ని ఎత్తు చేసి చదును చేయడానికి బయటి నుంచి గ్రావెల్ తీసుకురావాల్సి వుంది. దీనికి విరుద్ధంగా డంపింగ్‌యార్డులోనే నిర్మిస్తున్న స్టేషన్ పక్కన చెత్తను తొలగించి... దాని కింద వున్న గ్రావెల్‌ను ఈ అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రావెల్‌తోపాటు అక్కడ పేరుకున్న చెత్త వినియోగించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బయటి నుంచి గ్రావెల్ తీసుకురావడానికి రవాణా, కొనుగోలుకు లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుందని తెలిసి డంపింగ్‌యార్డులోని చెత్త కింద వున్న గ్రావెల్ తరలించారని అంటున్నారు. దీనికోసం రెండు క్వారీ లారీలు, ఒక జేసీబీని వినియోగించారు. నిర్మాణంలో ఉన్న స్టేషన్‌ను ఆనుకుని కేవలం రెండు మీటర్ల దూరంలోనే గొయ్యి తీసి గ్రావెల్ వినియోగించడంతో నిర్మాణదారులు రూ.లక్షలు మిగుల్చుకున్నట్టు జీవీఎంసీ సిబ్బంది ఆరోపిస్తున్నారు.



నమ్మివానిపేట డంపింగ్‌యార్డులో నిర్మిస్తున్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ఆవరణలో గ్రావెల్



గ్రావెల్ కోసం డంపింగ్‌యార్డులో తీసిన గొయ్యి

డంపింగ్‌యార్డులో గొయ్యి పెట్టి తరలించిన గ్రావెల్ బయట కొనుగోలు చేస్తే రూ.4 లక్షల వరకు ఉంటుందని అంటున్నారు. గ్రావెల్ కోసం డంపింగ్ యార్డులో తీసిన గొయ్యిని క్లాప్ వాహనాల ద్వారా వచ్చే చెత్తతో పూడ్చి వేస్తామన్న స్టేషన్ నిర్మాణ నిర్వాహకుల ప్రతిపాదనలను జీవీఎంసీ సిబ్బంది వ్యతిరేకించారు. నాణ్యమైన గ్రావెల్ కాకుండా చెత్తతో కూడిన గ్రావెల్‌తో నిర్మాణం వల్ల భవిష్యత్‌లో స్టేషన్ కుంగిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. దీనిపై జీవీఎంసీ మెకానికల్ విభాగం ఏఈ గణేష్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన స్పందించ లేదు. జీవీఎంసీ ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

మధురవాడ : జీవీఎంసీ 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ బాలాజీ హిల్స్‌పై వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. 17న ప్రారంభమైన ఉత్సవాలు 21న ముగియనున్నాయి. వేడుకలు, భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్వామి వారికి ఉదయం నుంచే సుప్రభాత సేవ, చక్ర తీర్థోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు కోనేరులో శాస్త్రోక్తంగా స్నానం చేయించి, పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమాలకు పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా హాజరయ్యారు. ప్రతినిధులు సాయిలీల, మగ్గూరి వెంకటరావు, చక్రధరరావు పాల్గొన్నారు.

- మధురవాడ సిద్దేశ్వర స్వామి పీఠం, మానం ఆంజనేయులు కాలనీలోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయాల్లో భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విశేషంగా హాజరయ్యారు.

మందుబాబులకు జరిమానా

పీఎం పాలెం: పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి న్యాయమూర్తి రూ. 51 వేల జరిమానా విధించారని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటరావు తెలిపారు. ఇటీవల తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 20 మంది పోలీసులకు చిక్కారు. వారిపై కేసు నమోదు చేయగా ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రెండో క్లాస్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి నిందితులకు మొత్తం రూ.51 వేలు జరిమానా విధించారని తెలిపారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు



బంతి, చామంతి, గులాబి దండల అలంకరణలో కొత్తమ్మతల్లి అమ్మవారు



బంతి, చామంతి, గులాబి, తులసిమాలల అలంకరణలో రాస పోలమాంబ అమ్మవారు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం గులాబి, చామంతి, బంతి పువ్వుల దండలతో అలంకరించారు. ఈ అలంకరణకు కొత్తపేటకు చెందిన బాసాన శ్రీనివాసరావు, బాలమ్మ దంపతులు సహాయ సహకారాలు అందించారు. రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వర్‌కుమార్, సంతపేటకు చెందిన దుంప శంకరరావు అమ్మవారిని అలంకరించారు. భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని బంతి, చామంతి, గులాబి, తులసి మాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు బల్ల శ్రీను, తేజశ్రీ దంపతులు సహకారం అందించారు.

బీఎల్‌వోలు శ్రద్ధగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ గోవింద్

భీమునిపట్నం : భీమిలి పరిధిలోని పోలింగ్ బూత్ అధికారులు (బీఎల్‌వోలు) ప్రత్యేక శ్రద్ధతో బాధ్యతలు నిర్వర్తించాలని తహసీల్దార్ గోవింద్ సూచించారు. నియోజకవర్గ స్థాయిలో 350 మంది బీఎల్‌వోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ తమ పరిధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముఖ్యంగా ఫారం 6, 7, 8ల ప్రకారం కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు, ఓటర్ల బదిలీ శ్రద్ధగా పరిశీలించి చేయాలని సూచించారు. కొందరివి రెండు ఓట్లు నమోదై వుంటే సరిచూసి ఒకటి తొలగించాలన్నారు. ఈవీఎంల పనితీరు, ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులు ఇళ్ల వద్ద నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని, అటువంటి వారిని గుర్తించి దరఖాస్తు చేయించాలని సూచించారు. ఎన్నికల డీటీ భాస్కరరావు, ఏఎస్‌వో శేషాద్రి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పీఎం పాలెం : దిశ పోలీస్ స్టేషన్ ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఉదంతంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున ఎండాడ దిశ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఓ వ్యక్తి పడి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించి విచారించగా... మృతి చెందిన వ్యక్తి జూ పార్కు పరిసరాల్లో సుమారు 3 నెలలుగా యాచన చేస్తూ జీవిస్తున్నాడని తెలిసింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



క్లుప్తంగా

అభివృద్ధి పనులపై హర్షం



ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న కాలనీవాసులు

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టడంపై కాలనీవాసులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఆయన నివాసంలో మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.45 లక్షలతో కమ్యూనిటీ హాలు, కాలువల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారని, గతంలో కూడా రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని ఆనందం వ్యక్తం చేశారు. కాలనీ హౌసింగ్ స్కీం అసోసియేషన్ అధ్యక్షుడు మగ్గూరి వెంకటరావు, వైస్ ప్రెసిడెంట్ రామచంద్రరావు, ప్రతినిధులు సన్యాసిరావు, పుష్ప, రోజా, ఎంవీపీ ఓజోన్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



నగరంపాలెం రోడ్డులో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మధురవాడ : తాగునీటి పైప్‌లైన్ పనులకు జీవీఎంసీ తాగునీటి విభాగం సిబ్బంది చురుగ్గా మరమ్మతులు చేపడుతున్నారు. నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు పనుల్లో భాగంగా రూ.80 లక్షలతో 800 మీటర్ల మేర నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ క్రమంలో వుడా కాంట్రాక్టర్ జీవీఎంసీ అధికారులకు సమాచారం ఇవ్వకుండా పొక్లెయిన్‌తో కాలువ తవ్వేయడంతో ఐదుచోట్ల పైప్‌లైన్ దెబ్బతిని వారం రోజులుగా పోర్టుకాలనీ పరిసర ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ప్రస్తుతం మరమ్మతులు చేయిస్తున్నారు.

విద్యార్థుల అభ్యసన స్థాయి పరిశీలన

ఆనందపురం : మండలంలోని బోని ఉన్నత పాఠశాలను రాష్ట్ర స్థాయి బృంద సభ్యులు ఎం.భారతి, టి.త్రినాథరావు, ఎస్.రాంబాబు, జి.రామనాథం మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో అభ్యసనాభివృద్ధిని పరిశీలించారు. ప్రతి సబ్జెక్టులో విద్యార్థుల స్థాయిని అంచనా వేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.

పద్మనాభం: మండలంలోని ఆర్వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను భీమునిపట్నం డైట్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.భారతమ్మ ఆధ్వర్యంలో నలుగురు సభ్యులతో కూడిన అభ్యసనాభివృద్ధి రాష్ట్ర బృందం లిప్ అమలు తీరును మంగళవారం పరిశీలించారు. ఆరు నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థుల నోట్ పుస్తకాలు, బోధనా పీరియడ్, సాధనా పీరియడ్లు ఏ మేరకు అమలు చేస్తున్నారో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఆర్‌జీలు ఎస్.రాంబాబు, జి.రామనాథ్, త్రినాథ్ పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న ఎనిమిదో తరగతి విద్యార్థిని కె.దివ్య, అసమాన ప్రతిభ కనబరిచిన మూడో తరగతి విద్యార్థిని జాహ్నవిని వీరు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో పి.రమణ, హెచ్ఎం వి.శంకరరావు పాల్గొన్నారు.

రోగుల చెంతకే కార్పొరేట్ వైద్యం



అమనాంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ దంతులూరి ఉమాదేవి, వైద్య సిబ్బంది

పద్మనాభం: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రోగుల చెంతకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న సదుద్దేశంతో 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం చుట్టారని ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు. పద్మనాభం సచివాలయం వద్ద మంగళవారం వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు ఖరీదైన వైద్యం కోసం ఇబ్బంది పడకూడదనే జగనన్న సురక్ష ద్వారా వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ సీఎం జగన్ చాలా గొప్ప నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. 634 మందిని వైద్యులు పరీక్షించారు. సర్పంచ్ తాలాడ పాప, వైద్యాధికారిణి స్వప్న, నాయకులు తాలాడ పద్మనాభం, తాలాడ నరసింహనాయుడు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం

తగరపువలస: గ్రామ గ్రామాన నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో ప్రజలంతా ఆరోగ్యంగా ఉన్నారని భీమిలి మండలం అమనాం పంచాయతీ సర్పంచ్ దంతులూరి ఉమాదేవి అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద రెండో విడత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ముంగిటకే నిపుణులైన వైద్యులు వచ్చి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటే మెరుగైన సంక్షేమ పథకాలు అమలు చేసిన మరో నేత దేశంలోనే లేరన్నారు. మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా చేసుకుని సంక్షేమ పథకాలు పొందేందుకు ప్రజలంతా ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా తాళ్లవలస పీహెచ్‌సీ ప్రధాన వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు, వైద్యులు ప్రణీత, హర్షిత తదితరులు 512 మందికి వైద్య సేవలు అందించారు. పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి రాజ్‌కుమార్, ఎస్.గౌరీమణి, డి.గౌరి, వి.గౌరి, బి.రమణమ్మ, శ్రావణి, సుధ, అపర్ణ, అమిత తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

138 మందికి పరీక్షలు

ఆనందపురం : పాలవలసలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 138 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 15 నుంచి వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించారు. అలా గుర్తించిన వారిని శిబిరానికి రప్పించి వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని నగరంలోని ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.గంగునాయుడు, షేక్ సహనాజ్ సాదియా, కేజీహెచ్ వైద్య నిపుణులు సేవలు అందించారు. ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం అధికారి ఉమావతి, ఎంపీడీవో నీలం అప్పలనాయుడు, సర్పంచ్ నాగోతు అచ్చియ్యమ్మ, సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి, పార్వతమ్మ పాల్గొన్నారు.

పథకాల అమలులో వలంటీర్లు కీలకం



పురస్కారాలు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు

ఆనందపురం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వ ఉద్యోగులతోపాటు వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాలవలసలో మంగళవారం వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సేవా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలు నేరుగా లబ్ధిదారుల చెంతకే చేరాలన్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి పుట్టిందే వలంటీర్ల వ్యవస్థ అని చెప్పారు.

వలంటీర్ల వ్యవస్థను భారత్ దేశంలోని రాష్ట్రాలన్నీ గమనిస్తూ అనుసరించడానికి ఆలోచన చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రజలకు విస్తృతంగా సేవలు అందిస్తున్న వలంటీరు వ్యవస్థపై టీడీపీ, ఇతర పార్టీల నాయకులు బురద చల్లడానికి ప్రయత్నించగా ప్రజలు తిరగబడడంతో తోక ముడిచారన్నారు. ప్రస్తుతం ఆ పార్టీలు కూడా వలంటీరు వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పుకునే దుస్థితిలో ఉన్నాయన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత చాలా సమస్యలు పరిష్కరించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, మరోమారు ఆయన్నే ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్రం అన్ని రంగాల్లోనూ పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా 370 మంది వలంటీర్లకు సేవా మిత్ర, ఐదుగురికి సేవా రత్న పురస్కారాలు అందజేసి శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నీలం అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, సర్పంచ్ నాగోతు అచ్చియ్యమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు రౌతు శ్యామల, నాగోతు మహేష్, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, డైరెక్టర్ రౌతు శ్రీను, నాయకులు బొట్టా రామకృష్ణ, రౌతు వెంకటరావు, పిన్నింటి వెంకటరమణ, కాకర వెంకట రమణ, చందక అప్పలస్వామి, డోల దేముడు, రెడ్డి మహేష్, లొడగల రమణ, గొలగాని కృష్ణ, పావాడ గౌతమి, చందక సూరిబాబు, లోలుగు రాజు, వంకాయల మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.

మామిడిలోవ చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం



మామిడిలోవ పల్లపు చెరువులో పనులు చేస్తున్న కూలీలు

ఆనందపురం : మండలంలోని మామిడిలోవలో ఉన్న పల్లపు చెరువు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. దీంతో స్థానికులకు ఉపాధితోపాటు, చెరువు అభివృద్ధి చెందనుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చెరువుకు రూ.9 లక్షల నిధులు కేటాయించారు. దీంతో చెరువు గట్లపై ఉన్న తుప్పలు, డొంకలు తొలగించడం, పూడిక తీత, గట్లు పటిష్ట పరచడం వంటి పనులు చేపడుతున్నారు. ఇన్‌చార్జి ఏపీవో తిరుమలరావు మాట్లాడుతూ గ్రామంలో 200 మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు.

శ్రీకృష్ణాలయంలో ప్రత్యేక పూజలు



తగరపువలస: భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం భీమిలి మండలం టి.నగరపాలెంలోని శ్రీకృష్ణాలయంలో అర్చకుడు పెంట వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం వీధుల్లో మేలుకొలుపు నిర్వహించిన అనంతరం ప్రత్యేక సుగంధాలతో స్వామికి అభిషేకం నిర్వహించారు. అనంతరం 1016 వంతున ఎర్ర కలువలు, తులసి ఆకులతో ప్రత్యేక అర్చన నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

లక్ష్మీనారాయణులకు విశేష పూజలు



తులసి మాలల అలంకరణలో శ్రీ లక్ష్మీ నారాయణస్వామి

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. ముందుగా స్వామిని తులసి మాలలతో అలంకరించి విశేష పారాయణ జరిపి పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.









